నెరిసి పోయినా మా బాధలవల్ల నీవింత అలసి సొలిసి పోయినా నీ కళ్ల కాంతే తగ్గిపోతున్నా ఈ చలికి ఓర్వలేక అష్టకష్టాలు పడుతూవున్నా కొంచెం యీ పట్టుదలతోనే వోపికపట్టి వుండు. ఈ చీకటి ఎంతకాలం ఉంటుందనుకొన్నావు? అది తాత్కాలికమే. అదిగో తూర్పు కొండల్లో నుంచి అరుణ కిరణాలు పైకి వస్తూ వున్నాయి. ఇక కొద్దిసేపులో ఆ సూర్యుడే ప్రత్యక్షమవుతాడు ఆయనే ఈబంధాలను తన వేడి కిరణాలతోనే పటాపంచలం చేస్తాడు. అమ్మా నీవు మాకిచ్చిన శిక్షణే ఇది. దాని ద్వారానే మేమూ సూర్యోదయానికే వేచివున్నాం. మా కలలూ, మా ఆశలూ, మా విశ్వాసమూ అప్పుడేజయప్రదంగాఫలిస్తాయి." అంటూ ధైర్యంచెప్పుకున్నారు.

ఇదే జర్మను రచయితలగానం-, ఈ గానాన్నే ఆలపిస్తున్నారు. ఇది ఇహలోకగానమా, లేక దేవతాలోకగానమా?

ఈ రచయిత ఈ వాతావరణాన్ని 1930-36 సం|| రాలమధ్య ప్రత్యక్షంగా చూచాడు. ఇట్టి వీర రచయితల పరిచయభాగ్యాన్ని ఆ కాలంలో సంపాదించగలిగాడు. ఆ దేశాన్ని వదలిపెట్టి వచ్చాక, వీళ్ళలో అనేకులు ఈ దారుణాగ్నికి ఆహుతులయిపోయారు. 1952-53 సంవత్సరాలలో తిరిగి నవజర్మనీని సందర్శించే అవకాశం లభించింది. ఒక సంవత్సరం తన పూర్వకాలపు మిత్రులమధ్య గడిపాడు. ఆ యుద్ధావస్థలో బాధపడ్డ రచయితల పరిచయభాగ్యమూ సంపాదించాడు. ఆ యుద్ధకాలంలో వాళ్ళూ, వాళ్ళ బంధుమిత్రాదులూ పడ్డబాధలను వాళ్ళనోటినుండే విని ధన్యుడయ్యాడు.

ఈ వ్యాసం—రచయిత స్వయంగా చూసిన, చదివిన సాహిత్యవీధుల యథాతథ చిత్రణే. 1933 నుంచీ యింతవరకూ పుట్టి పెరిగిన జర్మను సాహిత్యవేత్తలజీవితచరిత్రలు వినేందుకు కాలంవుంటే, అవకాశాన్ని పట్టి వాటి చిత్రణా చేయ సంసిద్ధుడే యీ రచయిత.

కథానిక

# ఉద్యోగపర్వంలో బృహన్నల

మధిర భానుమూర్తి

అవటానికి శర్మ పట్టభద్రుడయ్యాడు. అంతకు మించి చదవటం వల్లకానిపని అయింది. అయినా ప్యాసయి బయటకు వచ్చేవరకూ ప్రపంచంలో వస్తువులకీ మనుష్యులకీ ఉన్న నిజమైన విలువలు తెలవలేదతనికి.

కాలేజీలో ఉండగా తన చదువునుగురించి పొంగిపోయేవాడు. చాలా గర్వపడేవాడు. తలుచుకున్నప్పుడల్లా శరీరం అంతా ఏమిటోలా అయి తనని తాను మరచిపోయేవాడు. బి. ఏ. అనే ఆ రెండు అక్షరాల్లోనూ ఉంది కాబోలు ఆ శక్తి అంతా! అసలు అంత ప్రభావమున్న అక్షరాలను సృష్టించినవాణ్ణే అభినందించాలి అనిపించింది ఆతనికి. ఇంక కొద్దికాలంలోనే తనూ ఒక పట్టభద్రుడౌతున్నాడు. దాంతో తనకూ సంఘంలో గౌరవం పెరుగుతుంది ఎందరో తనను గౌరవిస్తారు. తను కాలేజీ వదలటంతోటే ఎన్నో ఉద్యోగాలు - పెద్దవీ, చిన్నవీ-తన ముందుంటే వాటిల్లోంచి తను ఏరుకోవాలి ఒక ఉద్యోగం. ఏమోనబ్బా! అన్ని ఉన్నప్పుడు ఏరుకోవటం కష్టం. అయితేనేం! ఏరుకోక తప్పదు కనుక ఏరుకుంటాడు. తగుమాత్రంగా ఉన్నతోద్యోగమే వస్తుంది—మరి తను పట్టభద్రుడుగా! అప్పుడు తను మిగిలిన అధికారుల్లాగ వెర్రిమొర్రి వేషాలు వెయ్యకూడదు. తగని అహంకారంతో విర్రవీగకూడదు. ఎంతసేపూ తన క్రింద ఉద్యోగస్తులను ఎంతో జాగ్రత్తగా చూడాలి వారు కూడా మానవులే అన్న విషయం గుర్తుంచుకోవాలి. పాపం ఎవరేనా గుమాస్తా తప్పుచేస్తే అందరికి మల్లే తను కసురుకోడు. జాగ్రత్తగా అతని తప్పు సరిదిద్దుతాడు. తను చెప్పకపోతే అతనికెలా తెలుస్తుంది మరి? అంతా తెలిసినవాళ్ళే ఉంటారా? అదీకాక తనుమాత్రం తప్పు చెయ్యడూ? కనుక వాళ్ళల్లో తప్పులుంటే సరిదిద్దాలేగాని, నిష్కారణంగా కేకలెయ్యకూడదు.

తను చాలా మంచివా డనిపించుకోవాలి. అందరిలాగే తనూ ఉంటే తన ప్రత్యేకతేముంది? తను ఇంత చదువుకున్నందుకు సార్థకతేముంది? అయితే అలా ప్రవర్తించేవాళ్లంతా చదువుకోనివాళ్ళా! కాదే! చదువుకోనివాళ్లకి అంతంత ఉద్యోగాలెలా వస్తాయి? అంటే చదువులో లేదన్నమాట. అసలు మనిషిలో ఉండాలి. ఎంత చదువుకుంటేనేం, గుణం మంచిది కాకపోయాక? అందుకని తను వాళ్ళకంటే భిన్నంగా ఉండి జాగ్రత్తగా ప్రవర్తించాలి...ఇలా ఎన్నెన్నో ఆలోచించుకునేవాడు రోజూ.

అప్పుడప్పుడు వీటిని గురించి చర్చించేవారు మిత్రులంతా. ఆ చర్చల్లోకూడా ఈ భావాన్నే తను పదే పదే చెప్పేవాడు. కొందరు ఏకీభవించేవారు. కొందరు వ్యతిరేకించేవారు. రావు ముఖ్యంగా శర్మ అన్న దానిని వ్యతిరేకించేవాడు ఎప్పుడూ. "క్రింది ఉద్యోగస్థులని కొంచెం కఠినంగా చూడకపోతే అధికారులంటే మరీ చులకనయిపోతుంది వారికి. ఆ అభిప్రాయం వారిలో బయలుదేరాక ఇంక ఏపనీ సవ్యంగా జరుగదు. అలాంటప్పుడు ప్రమాద మెక్కువ. అదీకాక, వాళ్ళని నొక్కిపెట్టాలేగాని తలెత్తనిస్తే లాభం లేదు." అంటాడు రావు, అధికారికి ఉండవలసిన ఠీవి అంతా కనపరుస్తూ. మిత్రులంతా తమ తమ అభిప్రాయాలు ఇలా నిష్కర్షగా చెపుతుంటే శాస్త్రి మటుకు మాట్లాడేవాడు కాదు. ఒక సంవత్సరం చూసి చూసి చివరికి రావు అడిగేశాడు, "ఏం శాస్త్రీ! మేమింత తర్జన భర్జనలు చేస్తుంటే నువ్వు ఒక్కమాటా మాట్లాడవు. నీ ఆంతర్యం ఏమిటి?" అని. శాస్త్రి మాత్రం చాలా స్థిమితంగా జవాబు చెప్పాడు, "మీరంతా ఏదో పెద్ద ఆఫీసర్లయిపోయినట్టుగా మాట్లాడుకుంటున్నారు. కాని నాకసలు నమ్మకంలేదు. తీరా ప్యాసయాక మనకి చిన్న గుమాస్తాగిరీకూడా దొరకదని నా అభిప్రాయం. ఎంతో తన్నుకులాడితే కొన్ని సంవత్సరాల తరువాత చిన్న నౌకరీ దొరకవచ్చునేమో!...ప్రపంచస్థితి ఇలా ఉండగా నేను పెద్ద ఆఫీసరు నౌతానని ఎలా అనుకోగలను?" అన్నాడు.

"నువ్వెప్పుడూ అంతే! నీకు అంతకంటె ప్రపంచంమీద నమ్మకంలేదు. నువ్వసలు నిరాశావాదివి. భవిష్యత్తుమీద ఈషణ్మాత్రం నమ్మకం లేనివాడివి. ఇంతసొమ్ము ఖర్చుపెట్టి ఈ చదువంతా చదవట మెందుకు? హాయిగా ఈ పాటికే ఏదో నౌకరీ చూసుకోక పోయావ్? ఎప్పటికేనా ఈ గుమాస్తాగిరియే తప్పదన్నప్పుడు ఇప్పుడే చేరటం మంచిదిగా!" అన్నాడు రావు.

"నువ్వక్కడే పొరపాటుపడుతున్నది. నేను నిరాశావాదిని మాత్రం కాదు నువ్వనుకున్నట్టు. నాకు మీకంటె ప్రపంచపు నిజస్థితిని తెలుసుకోవాలనే కోరిక, తెలుసుకునే అవకాశం ఎక్కువగా ఉన్నాయి. మీరు మీ ఊహాప్రపంచంలో స్వేచ్ఛగా విహరించగలరు. నేను ఈ వాస్తవిక ప్రపంచంలో లేనివి ఊహించుకుంటూ మురిసిపోలేను. అదే తేడా" అన్నాడు శాస్త్రి.

ఇలా చర్చించుకున్న మిత్రులు కళాశాల వదిలేసరికి వారికి ఈప్రపంచపు యథార్థస్వరూపం సాక్షాత్కరించింది. ఎక్కడా ఖాళీలులేవు. పెద్ద ఉద్యోగాలేకావు, చిన్నవికూడా దొరకటంలేదు. రోజూరోజూ పత్రికలుకూడా దేశవ్యాప్తంగా ఉన్న నిరుద్యోగాన్ని వర్ణిస్తున్నాయి. ఏ వూళ్ళోనో ఎం. ఏ. ప్యాసయినవాడు బంట్రోతుగా చేరటానికి సంసిద్ధుడయాడట. కారు కండక్టరు ఉద్యోగానికి వేలకొద్దీ పట్టభద్రులు దరఖాస్తు పెట్టారట...ఇదంతా విపరీతంగా ఉంది. వాళ్ళనివాళ్లు నమ్మలేకపోయారు. చదువుకునే రోజుల్లో తాము కన్న తీయని కలలన్నీ ఏమయాయో! ఇప్పుడాలోచిస్తే శాస్త్రిచెప్పినమాటలే నిజమనిపించింది రావుకీ, శర్మకీ.

నిజమే. మొదటినుంచీ శాస్త్రి యథార్థ పరిస్థితి గ్రహించగలిగాడు. అందుచేతనే ప్యాసవడంతోటే అతను ఒక కంపెనీలో గుమాస్తాగా చేరిపోయాడు. ఏదో వాళ్ళని, వీళ్ళనీ మంచిమాటాడుకుని నౌకరీ సంపాదించుకున్నాడు. నిజానికి తను నిరాశావాదికాదు వాళ్ళనుకున్నట్టు. అతని పనే బాగుంది.

శర్మ పరీక్షులయి ఇంటికివచ్చేసరికి ఊరినిండా అతని శ్రేయోభిలాషులే అగుపించారు. ఫలానా కోర్సుకి వెళ్ళవద్దని ఒకరూ, ఇంకా చదవాలిగాని ఇంతటితో ఆపటం తెలివితక్కువని ఒకరూ, ఏమ

యినా, ఈపాటికి ఒక ఉద్యోగంచూసుకు ప్రవేశించకపోతే ముందుముందు అసలే ఉద్యోగం దొరకదని ఒకరూ...ఎవరికితోచిన సలహా వారు అయాచితంగానే యిచ్చారు. ఎవరిమట్టుకువారే ఎంతో నచ్చచెప్పారు. అందరు చెప్పేదీ సబబుగానే కనిపిస్తోంది. అయితే, ఒకరి సలహాకి యింకొకరి సలహాకి ఎక్కడా సంబంధంలేదే! వీటిల్లో ఏది నిర్ణయించుకోవాలి తను? ఏమో! చాలా అయోమయంగా ఉంది. కాని ఒక సమస్య భగవంతుడే తేల్చేశాడు. గనక కొంత తేలికయింది. ఇంక చదువుప్రసక్తి లేదు. అందుచేత మిగిలినదల్లా ఉద్యోగం వెతుక్కోవటం అనటం నిస్సంశయం. కాని వచ్చిన బాధల్లా ఇదివరకు ఎందరో తనని ఉద్యోగంలో చేరమని బ్రతిమాలి ఉద్యోగాలిస్తారనుకున్నాడు. ఇప్పుడంతా తలక్రిందులయింది. ఎవరూ తనసలా బ్రతిమాలటం లేదు సరిగదా ఎక్కే గుమ్మం,దిగేగుమ్మం అన్న బాధ తను పెట్టుకోకపోయినప్పటికీ ఒక్కరూ ఉద్యోగమివ్వటంలేదు. కనిపించిన ఉద్యోగానికల్లా దరఖాస్తుపెట్టాడు. అయినా ఒక ఉద్యోగం కూడా రాలేదు.

కాని ఆతనికి ఒక్కపట్టుదలమాత్రం ఉంది. ఎందరుచెప్పినా అందుబాటులో ఉన్న మేష్టరీ అంటేమాత్రం తలకెక్కలేదు. ఆనాడు బాబాయి మాట వినిఉంటే ప్యాసయిన వెంటనే మేష్టరుగా చేరి ఉండేవాడు. ఈపాటికి తనూ ఒక ఉద్యోగస్థుడయేవాడు. కాని వినలేదుగా!

ఇలా కొంతకాలం జరిగేసరికి ఆవేదన మరింత ఎక్కువయింది. ఇన్నాళ్ళు సంఘంలో తనకు విశిష్టస్థానం లభిస్తుందన్న ఆశలు ఇప్పుడుండేందుకైనా ఆస్కారంలేదు. తను ఎంతో కాలంగా కలలుగన్న అధికారస్థానాలు ఇప్పుడు అందుబాటులో లేవు. చివరికి అధికారుల అడుగులకి మడుగులొత్తే చిన్నచిన్న ఉద్యోగాలుకూడా లేవని తేలింది. హృదయం మరింత బరువెక్కింది. ఈ పరిస్థితుల్లో తనకి అందుబాటులో ఉన్న మేష్టరీని కూడా కాలదన్నితే ముందుముందు అది కూడాదొరకదన్న పెద్దమనిషి మాటలలోనిసత్యం ప్రస్ఫుటంగా కనిపించింది ఆతనికి. చేసేదిలేక సమ్మతించాడు. దరఖాస్తుపెట్టాడు;ఉద్యోగంవచ్చింది.

ఈ విషయం చెప్పేసరికి "పోనీలే ఇప్పటికేనా జ్ఞానోదయమైంది. ఇక బాగుపడతావు"అన్నాడు బాబయ్య."ఏదో ఒకటి. ముందు జేరితే తరువాత ఎప్పుడు మంచి ఉద్యోగం వస్తే అప్పుడే వెళ్ళిపోవచ్చు దీన్ని వదిలి"అన్నాడు తండ్రి."ఏమండీ! మీ అబ్బాయిని మేష్టరుగా వేశారుట. చెప్పారు కారు!" అని ప్రక్కింటి ఆవిడ అడిగితే "మరే నమ్మా. వేశారు..ఇదేమంత పెద్ద ఉద్యోగమని!" అంటూ పెదిమివిరిచింది తల్లి. "ఆవేళ నేచెప్తే విన్నావుట్రా! ఇదుగో ఇప్పుడు తెలిసివచ్చింది. నువ్వే జేరుతున్నావు." అన్నాడు ఎకసక్కెంగా వెనకే మేష్టరుగా చేరమని సలహాయిచ్చిన ఊరి పెద్ద ఒకాయన. "ఇందులో కెందుకోయ్? మాయదారి ఉద్యోగం. ఎదుగూ బొదుగూలేనిది." అన్నారు శర్మకి బళ్లో పాఠాలుచెప్పిన మేస్టారు. "ఛా! ఛా! నువ్వంటే దీనికి ఒడబడ్డావుగాని, నేనయితే ఒప్పుకోను. ఉద్యోగం లేకపోతే ముష్టయినా ఎత్తుకుంటాగాని...ఇంత బియ్యేప్యాసయి, చివరకి యిదా!" అన్నాడు ఇంకా ఏ ఉద్యోగమూ దొరకని రావు. "కాలేజీలో ఉండగా చెప్పిన కబుర్లు కాదోయ్?...ఇప్పుడు మరి...నలభైమంది పిల్లలమీద వచ్చిన అధికారాన్ని ఎలా వాడుకుంటావో మరి! నీ ఔదార్యం అభిప్రకటించే అవకాశం నిజంగావచ్చిందిప్పుడు నీకు. పిల్లలు తప్పులుచేస్తుంటారు. వారిని మన్నించాలి సుమా! కోప్పడకూడదు." అని వెనకటి సంగతి జ్ఞాపకం చేశాడు ఎప్పుడూ స్థిమితంగా ఆలోచించే శాస్త్రి. "ఆ! ఇదీ ఒక ఉద్యోగమే? బతకలేక బడిపంతులన్నారు." అంది వినిపించేటట్టు మెల్లిగా సాగదీస్తూ శర్మ భార్య. "అన్నయ్యా! నాకు లోజా చుద్ధముక్కలు తెత్తావుకాదు బళ్లోంచి. బలే! బలే! అన్నాడు శర్మ తమ్ముడు వచ్చీ రాని మాటలతో. "బాగుందోయ్! మా పెద్దాడు కొంచెం మొద్దువెధవ మీబళ్ళో చదువుతున్నాడు. కాస్త కనిపెడుతుంటావు నువ్వయితే. నీకు వేరేచెప్పాలా!" అన్నాడొకాయన.

శర్మ ఇవన్నీ వింటూ బయలుదేరి వెళ్ళాడు ఉద్యోగంలో ప్రవేశించటానికి బరువు గుండెతో.

★